# కేశవ నామాలు

**వల్లూరి కృష్ణారావు**

"ఏమండీ...మాష్టారు ... మీ పేరేమిటన్నారూ?" అంటు ఇప్పుడిప్పుడే రైలులో పరిచయం కలిగిన పరిచితుడు అడిగితే అతడు నవ్వుతున్నాడు. అతడు నవ్వుతున్నాడంటే, అర్థం ఉంది నవ్వాడు. ఆ పరిచితునికి తెలియకపోవచ్చు: అర్థం కాకపోవచ్చు. "మాష్టారూ!" అని పిలుస్తూ పేరు ఇంకెందుకు? పేరు ప్రయోజనం అందుకే కదా! తద్వారా అనేక ఇతర చిన్న ప్రయోజనాలని సాధించుకోవచ్చు. అట్టి పిల్ల ప్రయోజనాలను పొందుదామనో? ఏమో?

"మాష్టారూ!" అన్న ఆసామీ నవ్వాడు. అతడు నవ్వాడని కాదు ఇతడు నవ్వింది. "మీ పేరేమి"టని అతడు అడుగుతే తనకేమని "శంభుగిరి ఉమామహేశ్వరశర్మ" అని చెప్పి, చిన్నగా ఇకిలించి చూసాడు అతనివైపు. తనూ "అదిమర్యాదగా" మాష్టారూ...మీ పేరేమిటన్నారే" అంటే" చెప్పడేం?" అనుకున్నాడు శంభుగిరి...అందుకే శంభుగిరికి—నవ్వు వచ్చింది.

కొంతమంది పేరు అడగ్గానే తడుముకోకుండా చెప్పి పారేసారు అడగడమే తడవుగా కొంతమంది ఉన్నారు...వారిదగ్గరే వస్తుంది అంత చిక్కున్నూ. ఆడపిల్లల్లా ఏక ఇదై పోతారే. సిగ్గుపడి, తలక్రిందకో, పైకో. ప్రక్కకో చూస్తారు. అదోలా మొహం పెట్టి, పళ్ళు ఇగిలించినట్లు ఒకమాటు పదహారుపళ్ళు చూపించి, సన్నగా చెపుతారు. కొంతమంది "ఎందుకు, "పోనిద్దూ" అన్నట్లు మొహం పెడతారు. "పేరు చెపితే నువ్వు జడుసుకుంటావురా" అన్న భావం కూడా ఉంటుంది వాళ్ళ తీరులో! కొన్ని చోట్ల అది సంభవమే కూడాను. "వ్యాఘ్రేశ్వర అవధానో!" అని అలవాటు పడిన ఆ పేరు ఆసామీ తక్కువ ఒక పట్టులో చెప్పతాడు. ఇక మన గొడవ చూడాలి విన్నాక! మన కర్ణేంద్రియం తికమక మవుతుంది. "ఏం చెయ్య నేమిటి" అంటుంది కర్ణేంద్రియం బుద్ధితో! "ఒక్కమాటు బుజ్జి గోక్కుని నోటిలో అంటుందికదా", "అయి, అయి" అవమని పళ్ళు ఇగిలిస్తూ! నోరు అలా చేస్తుంది అపుడు.,

మరికొంతమంది, ఒక్క క్షణం అంటే ఒక్క క్షణం సిగ్గుపడి, ముందర నసుగుతూ, నసిగి, తర్వాత భయంలేదు పోయిందన్నట్లు, గభుక్కున, ఒక్కమాటు, తృటిలో చెప్పి పారేస్తారు తమపేరును. ఉదాహరణకు... "మీ రేమిటి స్వామీ, చెప్పారు కాదని!" దాసరి వరాహరావు అడుగుతే "దా...స..రి" అని నసిగి, విడివిడిగా అక్షరాన్ని విడదీసి పలుకుతూ, ఎందుకొచ్చింది గొడవ, చెప్పి పారేసే పోయె! అన్న ధ్వనిలో, "వరాహ రావు" అని గభుక్కున అంటాడు. వరాహ రావు అనడానికి 'దా'ని ఉచ్చరించడానికి పుచ్చుకున్నంతకాలం కూడా పుచ్చుకోడు!

ఇంకోరకం ఉంది. మనం నానా తాపత్రయం పడాలి వాళ్ళతో. వాళ్ల పేరు చెప్పించడానికి - వాళ్లు ఒక పట్టాన చెప్పరు. మనల్ని తిప్పుదోవలు పట్టించడానికి - ప్రయత్నంచేస్తారు. శుభ్రమయిన పేరు, ఉమాపతి చెప్పలేడు. అతణ్ణి తెలియనివాళ్లు అడుగుతే, అతను. అతి తెలివిగా, సందు ఏమీ ఇవ్వకుండా, ధోరణి మార్చేసి, అవతల వాడు వేసిన ప్రశ్నే మరిపింప చేసాడు.

ఒకమాటు అన్నాను "నీపేరు చెప్పడానికి అంత గొడవ దేనికి?" అంటే; వాడు అంటాడూ..., "నా పేరు చెపితే అంతతో అవదు. నా కథలుగురించి, పత్రికలగురించి, పత్రికల రుచులుగురించీ..."

"రుచులేమిటి...రుచులు?" అని మధ్యలో అడ్డు వేశాను.

వాడు చెప్పడం మొదలు పెట్టాడు. (విందాం!) "రుచులంటే...మనకు కొన్ని రుచులు ఎలా అయితే ఉన్నాయో, పత్రికలకుకూడా కొన్ని రుచులు ఉన్నాయి. ఒక పత్రికలో మనం చూసే కథలనుబట్టి మనం దాని "రుచి"ని కనిపెట్టగలం. ఆ 'రుచి' ని రచయిత అనుసరిస్తాడు. ఉదాహరణకు...ఒక పత్రికకు మనం ఏడవాలి. ఉత్తి సే, ఏడుస్తూ వ్రాసిన, ఏడుపుకథను, ఏడుపు మయంగా ఉంటే, అది అచ్చుపడుతుంది. అలాంటి కథలు సాధారణంగా "కన్నీటికడలి", "కన్నీరు మున్నీరు", "కళ కళ్ళల్లో కన్నీటి కాలువ!" లాంటివి.

ఇకపోతే ఇంకో పత్రిక్కు మనం నవ్వాలి. చూడు ఎంత కాంట్రాస్ట్! నవ్వుతూ ఏక ఇదై పోవాలి. "మీరేం చేసినాసరి, ఇక నేనుమాత్రం నవ్వలేనండీ!" అన గలగాలి ఆకథ చదువుతోంటే. "అబ్బ! ఉండురూ", "ఊఁ, మీరు మరీనూ"... లాంటి కథలు ఈ కోవకు చెందాలి సాధారణంగా!

"మరో పత్రిక్కు మనం తిట్టాలి. ఆ పత్రిక నాధునికి మనం ఎంత తిడితే ఆయనకు అంత సరదా. వాడు వెధవ...నీకు వెధవ అంటే, ఆయనకు సంతుష్టిగా భోజనం చేసి, తాంబూలం నములుతూ, వాసాలు లెక్కబెడుతూ, తూగుటుయ్యాలమీద వెల్లకిలా పడుకున్నట్లుంటుంది.

"ఇంకోరకం పత్రిక ఉంది దానికి గొడవే అక్కరేదు. దాని 'ఫీల్డు' అంతా వేరు. మాయలు మంత్రాలు కావాలి "కీలుగుఱ్ఱంపై రాజకుమారుడు" లాంటి కథ మనల్ని మరో ప్రపంచంలోకి లాక్కుపోతుంది.

"ఇంకోదానికి 'థ్రిల్సు', 'వండర్సు' కావాలి కథపేరు మాత్రంతోటే "చచ్చాం ఫో" అనేసి తబ్బిబ్బులుపడాలి "ప్రఖ్యాత సినీతారవచ్చి ఊగకొంది ఆ నుట్న" "విరమల్లుని అంతరానం! లాంటి కథలు. "కోజేశ్వగాడు శేషుబాబు ఎక్కడ? అని మనల్నే ప్రశ్నిస్తుంది. పేరు చూసేనే దీన్ని ఎలాగయినా చదవాలనే తహ, తహ, ఆకాంక్ష కలగాలి పత్రికలో!

మొత్తంమీద నా చేత వాగించావు... తెలిసిందా"...అనేసి ఊరుకొన్నాడు.

"తెలిసింది తెలిసింది" అన్నాను.

"జంట స్వరాలు మాను." అని మందలించాడు.

మానేశాను!

తర్వాత ఉమాపతి చెప్పిందేమంటే, (పెద్ద ప్రఖ్యాత రచయితలా మొహం పెట్టాడు. వెధవ గొప్పా వీడూను.) తనపేరు చెపితేట "ఒయబ్బా! వీడా, ఆ పప్పు ఉమాపతి! ఎవడో అనుకున్నాం. పెద్ద పులిలా ఉంటాడనుకున్నాం—బుల్లి అప్పచ్చిలా ఉన్నాడు!" అనుకుంటారుట! పైగా, వీడు వాళ్ళని వదిలేదాకా, 'జూ' లోని జంతువుని చూసినట్టు చూస్తారట (గొప్ప!) ఈ తతంగం అంతా ఎందుకని వీడు చెప్పట తన పేరును సాధారణంగా...ఇంకా ఏవేవో చెప్పాడు వెధవ సెల్ఫు!

వాడు రచయిత మాత్రం అవును. కాని వాడు అనుకొన్నంత గొప్పవాడు మాత్రం కాదు. వాడి వాదనలో కొంతనిజం ఉన్నా పెద్ద ప్రఖ్యాత రచయితనని భ్రమించడంలో వాడి మతిభ్రమణం కనపడింది నాకు!

పెద్ద రచయిత, శిల్పి రాజకీయ వేత్త, విద్వాంసుడు, గానకోవిదుడు మొ॥ వారు కొత్త చోట్ల, తమకు తాము పేర్లు చెప్పకోరు. అలా చెప్పకోకపోవడం, "తమ అహం" కు చిహ్నం ఉమాపతి చెప్పింది ఒక కారణం. మరి ఒక కారణం కూడా ఉంది...

పెద్ద పెద్ద ప్రభువులు...తమ పేరుతాము చెప్పకోవడం నీచాతి నీచంగా భావించే వారుట...తమ పేరును చెప్పకోవడం నీచంగా భావించే, వారు ఆ పేరు ఇతరుల నోటి వెంట వినడం ఘనంగా భావించడం విచిత్రమే!

శంభుగిరి అతణ్ణి గురించి "ఏదో అయి వుండవచ్చు అనుకొన్నాడు. ఇతను శిల్పా? రాజకీయ వేత్తా? రచయితా? మరి నా బొందా?" అని కూడా అనుకొన్నాడు చివరన. తను అనుకున్న పదార్థాలను ఒక్కొక్కటే తీసి, అతనికి తగిలించి చూడసాగాడు శంభుగిరి.

ఇతడు శిల్పేమో!

వెంటనే కాదు అనుకొన్నాడు. "మనిషి బోసి పల్లిగా ఉన్నా కళ్ళలో కాంతులు లేవు శిల్పికి ఏవేవో కాంతులు ఉంటాయట. అతని కళ్ళు వట్టి మన కళ్ళు! అతని చేతిని, తేరిగా పరీక్ష చేశాడు. "చస్ అనుకొన్నాడు. "ఏడి మొహం, ఏడి మూతి, ఏడి తలకాయ, ఏడి బొంద..." ఇందులో ఏ ఒక్క దానిలోనూ శిల్పం లేదు. వీడు శిల్పి కాదు. పాడూ కాదు."

వీడు రాజకీయ నాయకుడా?

"కాదు. వెనక కుళ్ళు నాగమ్మ, కళ్ళ వెధవని కాదు. రాజకీయానికి కుట్రేమిటి పెద్దేమిటి? చదువుకోవాలా మన్నుకావాలా? ఏమీ అక్కరేదు. వీడు ప్యాంటు వేశాడు అనుకో...అయినా వాడు మాత్రం కాదు. రాజకీయాలు పనిగా పెట్టుకొన్న వాడి కంఠం ఎప్పుడూ ఖంగు మంటుంది. అసలు మాటాడ్డు. ముచ్చు!"

వీడు రచయిత అవునా?

"అబ్బే! వీడి అబ్జర్వేషన్ తగలేసిరి. పండిన పసిడిచేలన్నీ వదలి, కూడూగు అవతల ముళ్ళ దిబ్బలమీద పారిస్తాడు దృష్టిని... ఏడిశాడు!"

గానం...?

"ఏమీ చెప్పలేం" గభుక్కున..."నా బొంద! ఏమీ లేదు. "ఇందాక, ఆముసాడు పాడితే మిడుకు మిడుకూ చూడ్డం తప్పితే అహ్లాదం ఏదీ!"

శంభుగిరి ఒక నిర్ధారణకి వచ్చాడు.

"వీడు ఏమీ కాదయ్యా!

అయినా, తనలో తాను ఇలా కొట్టుమిట్టాడ్డం ఎందుకు? శుభ్రంగా కనుక్కోక! ఏదైంది అడిగి తెలుసుకోవాలనే తహతహ శంభుగిరిలో ఎక్కువైంది. గుప్త సత్యాన్ని తెలుసుకోవాలనే మానవ దౌర్బల్యం ఇప్పటిది కాదు. అనాది మానవుడినుండీ, ఈ దౌర్బల్యం విడకుండా వస్తూ నేఉంది. బ్రహ్మరాక్షసి విశాలమైన సౌధమంతా వదలి "చూడు, యువరాజా! ఆ గది మాత్రమే చూడకు" అంటే, ఆ యువరాజు ఆగడో! ఆగడో!! అంటూ కూర్చుంటాడు. చంద్రగోళం ఏమిటి? దాని అంతు కనుక్కోవాలి? ఎవరెస్టు ఎక్కాలి. ఎక్కారు. అక్కడున్నదేమిటి? మంచు ముద్ద!! అంతేనా...?

అతడిపేరు ఏదైతేనేం అని శంభుగిరి అనుకోలేదు. అతడు తన పేరు దాచిన కొలది శంభుగిరిలో మక్కువ ఎక్కువ కాసాగింది. అయినా అతడు తన పేరు చెప్పకోవడం చిన్నతనంగాగాని, భయంగాని ఉండడంలో ఏమి ఇది ఉందో శంభుగిరికి అర్థంకాని విషయం... కొంతమంది.. "నా పేరు అడగండీ" అన్నట్లుంటారు!

"ఏమండీ..." అని పలుకరించాడు శంభుగిరి. అతడు ఇతడివైపు యూగవాడిలా చూశాడు. నవ్వాడు. శంభుగిరి కూడా నవ్వాడు.

అతడు శంభుగిరి అసాధ్యుడనుకున్నాడు. అయినా శంభుగిరి అసాధ్యంతో తనకేం మెచ్చె! శుభ్రంగా పేరు చెప్పి పారెయ్యక అక్కడే వస్తుంది అంత చిక్కాను కొంత మంది ముచ్చటగా ఒకొక్క పేరును అలవాటుపడతారు. కాని, తనలాంటివారు చాలమంది అరుదేనా, వారిని చూసేనే, ఏమీ లేక నవ్వువస్తుంది. తన తమ్ముడికి తనగనే పట్టాలా? పొద్దున్న విషయం జ్ఞాపకానికి వచ్చి గభుక్కున నవ్వాడు. వాళ్ళ అమ్మ తమ్ముణ్ణి ఎలా పిలిచిందంటే.

"ఓరే సత్తిపండూ!"

పలకడు సత్తిపండు.

"సత్యం."

లాభం లేదు.

"సత్తీ"

అబ్బె!

"సత్తిగా!"

ఊహు!

"సత్యన్నారాయణా!"

హమ్మయ్య! వాడిపేరు సత్యన్నారాణ!! ఇంటిలో వారికి కోపంవసే తప్ప, ఆ అబ్బాయి, సత్యన్నారాయణ అని వారికి తెలిసిరాదు. అక్కడికీ సత్యన్నారాయణ మూర్తి దర్శనమివ్వలేదు. భక్తురాల్ని పరీక్షిస్తున్నట్లు, తల్లిని పరీక్షిస్తున్నాడు రెండవ అబ్బాయి! ఆమె సత్యన్నారాయణ నామాల్ని జరిపిస్తున్నది.

"ఓరే...నారీ..."

.........

"ఓరే...సత్తివెధవ..."

అప్పుడ నామాలు పూర్తికాలేదు.


"ఎక్కడతగలడ్డావురా...కోతివెధవా?"

అనడమే తడవుగా ఠక్కున బయట పడ్డాడు! చాలామంది ఒక్క పేరుతో నే మడిగట్టుకు కూర్చోరు. అనేక నామాలు ఉంటాయి. అనేక వస్తువుల్లో, ఒక వస్తువ మీద యెక్కువ మక్కువ ఉండడం సహజమైనట్లు, ఒకో నామం మీద మోజు ఉంటుంది! రాజారావును..."రాజ్" అని బాధగా, అవిసాని నాటిక ఆఖరి సీనులో


ఫిలిప్స్

PHILIPS

క్రొత్త మోడలు



BCA 236 B
4 వాల్వుల
బ్యాటరీ
రేడియో
రు. 185/-లు

—వివరములకు—

మోడరన్ ఆటో స్టోర్సు

కాన్వెంటు వీధి, — విజయవాడ 1.

NVKR

# ★ కేశవనామాలు ★

గాయిక నాయకుణ్ణి ఒరిగిపోతూ పిలిచినట్లు పిలిస్తే రాజారావుకు ఇష్టం.

అతడు ఈ విషయమే జ్ఞాపకానికి వచ్చి నవ్వుకున్నాడు. శంభుగిరికి అర్థంకాని విషయమే ఇది. మాటమాట్లాడడుగాని పకపక నవ్వుతాడు. అది పెద్దమనిషి తరాహా కాదు. అదే అందామనుకున్నాడు. కాని పరిచయం తక్కువ. అయినా, కార్యసాధకుని లక్ష్యం, విధానం అదికాదు. అందుకనే, కోపాన్ని, ద్వేషాన్ని దిగమింగి,

"అలా మీలో మీరు నవ్వుకుంటే ఇతరుల వాళ్ళు నరకంలో ఉంటారు పంతులుగారూ!"

తిరిగి నవ్వాడు..."మరోకనామం."

శంభుగిరికి అర్థంకాలేదు అతడిభాష. "ఏమిటిమీరనేది?"

అతడు నవ్వాడు.

శంభుగిరికి కోపం వచ్చింది. కాని పైకి ఏమీ అనలేదు. అతడు గ్రహించాడు.

"చెపుతాను. బాధపెట్టను. ఎవరైనా పేరు అడుగుతే నాకు చచ్చేచావు. ఏ పేరు చెప్పాలో అర్థంకాదు."

"అంటే...?"

"అందరూ తలోకపేరూ పెట్టి పిలుస్తారు. మీరు పంతులారూ, మా సారూ అనరే. నన్ను మా బామ్మ "అవతారమూ" అనిపిలుస్తుంది.

"మీ పేరుకాదా అది."

"పేరు కానేకాదు. అసలు ఆ రైలుపెట్టె పూర్తిగా మీటరుగేజ్‌ది."

రైలులా అంత ఉంటుందా మీ పేరు?" శంభుగిరి నవ్వాడు. నవ్వి, "చెప్పండి" అన్నాడు.

"అవతారం అని ఎందుకంటుందంటే, మా తాతయ్య పోయాక, నేను భూమిమీద పడాను. ఆయనే ఈ అవతారంలో వెలిశారని ఆమె ఊహ అవ్వచ్చు. ఆయనపేరూ.." కళ్ళు మూసుకొని, తలపైకెత్తి. గుక్కపట్టి

"వీరవెంకట సత్యహనుమాన్ వరాహ శ్రీకేశవనారాయణవర్మ...మా ఇంటిపేరు జలావర్జులవారు." ఇంటిపేరు మంచినీళ్ళు తాగిన తర్వాత నెమ్మదించి చెప్పినట్లు చెప్పాడు.

శంభుగిరి ఒక్కమాటు నిశ్చేష్టుడయ్యాడు!

"మీ పేరు అదన్నమాట. బాగుంది. పదిరోజులు వ్యవధి ఇచ్చినా చెప్పలేడు తడుముకోకుండా, అసలు ఆర్డరులో పిలవలేరనుకోండి..." వెంటనే ఏదో జ్ఞాపకానికి వచ్చి ఫక్కుమన్నాడు. ఫక్కుమనడమే కాదు నవ్వలేక తల ఆడించాడు. అతనికి (అతని పేరు ఎలానూ అనలేం. అతనే అందాం. అదే అలవాటు అయిపోయిందిగా ఎలానూ! తెలియక)

"ఏమిటి నవ్వుతున్నారు" అన్నాడు అతడు.

"అబ్బే ... ఏం లేదు. మీ పెళ్ళి అయిందా?" శంభుగిరి ప్రశ్నించాడు.

"అయింది...ఆఁ!"

"తలుపుదగ్గర ఇంతపేరూ చెప్పారా? అని."

"ఓఁ అదా?" ఫక్కుమన్నాడు అతడు. "ఆమె పేరు చాలా చిన్నదిలెండి. అనడం తేలిక కూడాను. ఇదెందుకు చెప్పానంటే దీనిమీద ప్రశ్న దొర్లిస్తారు. అవునా?"

శంభుగిరి ఒప్పుకున్నాడు. శంభుగిరికి శ్రద్ధ కలిగింది. అందుకే అడిగాడు.

"బామ్మగారి రెండో కారణం మరి."

"ఏముంది! భర్త పేరు పిలుస్తారా?"

శంభుగిరి ఈ విషయంలో ఐక్యంకావడం అతడికి సరదా పుట్టుకొచ్చింది.

"మిగతా వ్యవహారంకూడా చెపుతాను వినండి." అన్నాడు.

"మంచి కాలక్షేపంగా ఉంది. చెప్పండి" అన్నాడు శంభుగిరి.

"అమ్మ ఏమో నానీ! అని పిలుస్తుంది."

"కారణం లాంటిది...?"

"నాకున్న నామాలవెనక ప్రతిదానికీ బ్రహ్మాండంగా కారణాలు ఉన్నాయి. మా అమ్మకు తోబుట్టువులెవ్వరూ లేరు ఆమె ఒక్కతె మా తాతయ్యకు మగపిల్లలు లేరు. ఆయనకు మగపిల్లలు అంటే సరదా. అందుకు నన్ను 'నానీ' అనేవాడు. ఆయన అలా అనడానికి కారణం, మగనలుసు పుడితే, వాళ్ళ నాన్నపేరు పెడదామనుకున్నాట్ట అందుకే "నాన్న"ను "నానీ" చేసి పిలిచాడు నన్ను. మా అమ్మ మా తాతయ్యను అనుసరిస్తుంది. మా అమ్మకు నా ముద్దుపేరు నానీ!"

"ఇక పోతే మా నాన్న తిలక్‌బాబు అంటాడు."

"అదేమిటి చాలా ఆశ్చర్యంగా ఉంది. ఎక్కడా సంబంధం లేదు."

"ఉంది. చాలా సంబంధం ఉంది. మా నాన్నకు రాజకీయాలంటే ఇష్టం. తిలక్ ఆయనకు పూజనీయుడు ఆయనపేరు పెడదామని ఉండేది ఆయనకు. కాని మా అమ్మ పెటనిచ్చింది కాదుట...'ఇదేం పాడ్యేకాలంరా' అందిట కూడా!"

"పోనీ...మీ తర్వాత సోదరులు..."

"లేకేం ఉన్నారు. వారంతా వరప్రసాదులు."

"మీరు కాదా...?"

"అదే అనుమానం. మా తాతతాత సత్యన్నారాయణమూర్తి నారాధించేవాడు. మా తాత తండ్రి హనుమాన్‌భక్తుడు. మా తాత దశావతారాల్లోని వరాహ అవతారాన్ని ఎక్కువగా ప్రేమించేవాడు. మా తాత పేరు"...

శంభుగిరి ఒక్కమాటు అదిరి..."చెప్పారు ఇందాక...మీ తండ్రిగారి పేరు..."

నవ్వుతూ..."ఆయన పేరు భయంకరమైనది కాదులెండి."

"నన్ను మిమ్మల్ని ఏమనిపిలవమన్నారు?"

సాక్షాత్తూ భగవంతుడు మూఢులైన మానవులకు తననిగూర్చి చెపుతున్నట్లు, ప్రశాంతంగా, నెమ్మదిగా, "నన్ను అడిగి పిలుస్తున్నారా అంతా! పదిమంది పదిరకాలుగా పిలుస్తారు; తెలియక... నేను ఏ నామాన్ని ఉచ్ఛరించినా, పలుకుతాను. నా కేదో ఫలానా నామం ఇష్టమని, లేదా వారికిష్టమైన నామం నాకు ఇష్టమని నన్ను ఆ నామంతో పిలుస్తారు..."

"స్వామీ! అర్థం అయింది. మీరు మామూలు ధోరణిలో పడండి, మద్రాసు వచ్చింది. దిగుదాం..."

రైలు కూతతో పెద్ద రొద ప్రారంభం అయింది 'అతడు' ఆ జనంలో ఒకడు అయిపోయాడు! శంభుగిరి తీరా చూస్తే అతని పంచీ, తన చేతిలో ఉండిపోయింది ... వెంటనే గురుకువచ్చి...

"ఏమండీ...వీర...తర్వాత రాలేదు!★

పండిత డి గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond Jubilee
1898 1958
ఆయుర్వేదాశ్రమం(ప్రైవేట్)లిమిటెడ్,
మదరాసు-17.